# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర



# హోం ఆటోమేషన్

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

"అమ్మా! పొద్దున్నే తొందరగా వెళ్ళాలి, ఆరు గంటలకి అలారం పెట్టుకున్నాను, ఒకవేళ నేను నిద్ర లేవకపోతే నువ్వు లేపు, బామ్మా, నువ్వైనా సరే! " హాల్లో మంచం మీద వాలుతూ  అన్నాడు రాహుల్.

" ఏమిట్రా రాహూ, రేపేదైనా ప్రత్యేకమైన పనా? "అని అడిగింది పక్కనే కూర్చున్న అతని బామ్మగారు.

"అబ్బా! బామ్మా, అలా 'రాహూ ' అని పిలవవద్దని ఎన్ని సార్లు చెప్పాను? ఏదో రాహు కేతువుల్లా అనిపిస్తుంది. నాకెంత మంచి పేరు పెట్టారు,  నాన్న 'రాహుల్' అని, తెలుసు కదా  బుద్ధుడి కొడుకు పేరు." అన్నాడు విసుగ్గా.

" సరేలేరా,  ఇంతకీ అసలు విషయం చెప్పు"  అందావిడ సినిమాల్లో రాధాకుమారి బామ్మ లాగ.

పని మాట వచ్చేసరికి  విసుగు మర్చిపోయి..

" అవును బామ్మా, మేము గత కొన్ని నెలలుగా చేస్తున్న పనిని రేపు ఒక పెద్ద కంపెనీ వారికి చూపించాలి. వాళ్ళకి నచ్చితే పెద్ద ప్రాజెక్ట్ మాకిస్తారన్నమాట.. అప్పుడు మాకు బోలెడంత పని అన్నమాట "అన్నాడు సంతోషంగా.

" ఓహో,  అలాగా! బావుందిరా, ఐతే, వాళ్ళ పని వాళ్ళెందుకు చేసుకోరు,  అంత పెద్ద కంపెనీ ఐతే? అయినా వాళ్ళిస్తే మాకు బోలెడంత పని అంటున్నావు, మరి ఇన్నాళ్ళు,  అర్ధరాత్రివరకూ ఇంటికి రాకుండా మీరందరూ చేస్తున్న పనేవిట్రా మరి ? "అని ఆవిడ ఇంకా ఏదో అడగబోతూ ఉంటే,

"అబ్బా, నీ లాజిక్కులతో చంపకు బామ్మా,  నిద్రపోవాలి నేను.  లేకపోతే పొద్దున్న లేవను. మిగతా విషయాలు రేపు చెప్తాను వివరంగా " అని దిండు తల మీద పెట్టుకుని గోడ వైపు తిరిగి పడుకున్నాడు.

" సరేలేరా, కాచ్ యూ టుమోరో " అంటూ నవ్వింది ఆవిడ.

రాహుల్ వాళ్ళది మామూలు మధ్యతరగతి కుటుంబం. ఎప్పుడో తెలుగునాటనించి వచ్చి తమిళనాడులో స్థిరపడిన కుటుంబం వారిది.  రెండు తరాలుగా అక్కడే ఉండడం వల్ల ఆ ప్రాంతపు  ఆచారాలు, వ్యవహారాలు ఎన్నో తమ పద్ధతుల్లో కలుపుకున్నా సరే,  ఇంట్లో భాష మాత్రం స్వచ్ఛమైన తెలుగే మాట్లాడతారు. తమిళనాడు ప్రభుత్వోద్యోగి ఐన తండ్రి రాఘవరావు, ఇంటి దగ్గర స్కూల్లో ఇంగ్లీష్ టీచర్గా పని చేస్తున్న తల్లి భారతి, డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న చెల్లెలు దివ్య, బామ్మ పార్వతమ్మ. ఇదే రాహుల్ వాళ్ళ కుటంబం.

పార్వతమ్మ వయసు ఎనభైకి దగ్గర పడుతున్నా ఆరోగ్యంగానూ, చురుకుగానూ ఉంటుంది. అంతే కాదు, మనవలిద్దరితోనూ సరదాగా కబుర్లు చెప్పడం, వాళ్ళ మాటల్లో దొర్లుతున్న ఇంగ్లీష్ వాక్యాలు, పదాలు ఆకళింపు చేసుకుని, అవి వాళ్ళతోనే అంటూ ఉండడం ఆవిడకి చాలా సరదా. రాహుల్కి పార్వతమ్మ దగ్గర చాలా చేరిక. ఇద్దరూ ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుకుంటూ, వాదులాడుకుంటూ, పోట్లాడుకుంటూ ఉంటారు.

రోజువారీ  పూజా పునస్కారాలూ, టీ.వీ సీరియల్స్ కాక ఆవిడ క్రమం తప్పకుండా రోజూ చేసే పనులు మూడు. మూడింటికీ కూడా ప్రత్యేకమైన కారాణాలున్నాయి. మొదటిది ఇంటి వెనక ఉన్న మూడు పత్తి చెట్లనించి వచ్చిన పత్తితో సంవత్సరానికి దాదాపు రెండువేలకి పైగా వత్తులు చెయ్యడమూ ,  రెండోది క్రమం తప్పకుండా న్యూస్ పేపర్ చదవడం, మూడోది మధ్యాహ్నం స్క్రేబిల్ ఆడడం.

"నీ కోడలు ఇంగ్లీష్ టీచరు కదా, నువ్వు నేర్చుకోవాలి ఇంక "అని తోడికోడలు వెక్కిరిస్తే చదివిన ఎనిమిదో తరగతి జ్ఞానాన్ని పెంచుకోవడానికి పేపర్ చదవడం మొదలుపెట్టింది, అది అలా మానలేని అలవాటుగా మారిపోయింది.. అలాగే మనవలతో సరదాగా 'రాట్, బాట్' లతో మొదలయిన స్క్రేబిల్ కూడా అంతే. అందరూ బయటకి వెళ్ళిపోయాక అది ఎంతో కాలక్షేపం ఆవిడకి.

ఇక వత్తుల విషయానికొస్తే పెద్ద కథే ఉంది దాని వెనక.

రాహుల్ నాన్న, రాఘవరావు చిన్నప్పుడు ఒకసారి కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్రస్నానానికి వెళ్ళారు. ఎప్పుడూ వెళ్ళే సముద్రమే అయినా ఆరోజెందుకో నిండుపౌర్ణమి వెలుగులో ఉరకలేస్తున్న అలలతో వింతగా మెరుస్తోంది. పిల్లవాడిని రెండుచేతులా ఇద్దరూ పట్టుకుని మెల్లగా నడుస్తున్నారు. చంద్రుడేమో పెద్ద వెలుగు బంతిలా సముద్రం దగ్గరకి వస్తున్నట్టుగా కనిపిస్తున్నాడు, సముద్రమేమో ఉరకలేస్తున్న అలలతో,  అతన్ని తానే ముందు అందుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. అలలు, స్నానానికి వచ్చిన జనం, దీపాలు, వీటన్నింటితోనూ చాలా కోలాహలంగా ఉంది.. ఇంతలో ఉన్నట్టుండి అలల వేగం హెచ్చింది, అలా పార్వతమ్మ చూస్తూ ఉండగానే రెండు పెద్ద,  పెద్ద అలలు ఒకదానివెంట ఒకటి రావడమూ, వాటిల్లో రాఘవరావూ, అతని తండ్రీ కొద్ది దూరం కొట్టుకుని పోవడమూ క్షణాల్లో జరిగిపోయాయి. అయితే రాఘవరావు తండ్రి మంచి ఈతగాడు కావడాన పిల్లాడిని భుజాన వేసుకుని ఒంటి  చేత్తోనే  ఈదుకుంటూ బయటకి వచ్చాడు దాదాపు ఇరవై నిమిషాల తర్వాత. ఈ లోపున పార్వతమ్మ పరిస్థితి చెప్పనలవి కాదు. భర్తా, బిడ్డా ఏమయ్యారో తెలియక ఆవిడ భోరున ఏడవడం మొదలుపెట్టింది. రకరకాల మొక్కులు మొక్కింది. కాసేపటి తర్వాత, కులాసాగా వచ్చిన వారిద్దరినీ చూసి ఆనందంతో స్పృహ తప్పింది ఆవిడకి. ఆవిడ తేరుకున్నాకా వెంటనే ఇంటికి వచ్చేశారు.

ఆరోజు నించీ ఆవిడకి కార్తీక పౌర్ణమి అంటే విపరీతమైన భయమూ, భక్తీ కూడా.  ఆ రోజుకోసమే, మనిషికి,  సంవత్సరానికి 365 వత్తులు చొప్పున తనకీ, భర్తకీ, తన కొడుకు కుటుంబం నలుగురికీ, పేరు పేరునా చేస్తుంది. అవి దగ్గరున్న శివాలయంలో కార్తీకపౌర్ణమి నాడు వెలిగిస్తుంది. ఆవిడ మొక్కిన మొక్కుల్లో అది ఒకటి. ఇన్నేళ్ళుగా ఒక్క ఏడాది కూడా మానలేదు.. కానీ ఈ మధ్యన పెరుగుతున్న వయసువల్ల,  వేళ్ళల్లో సత్తువ తగ్గి, వత్తులు ఇదివరకంత బాగా

చెయ్యలేకపోవడం ఆవిడకెంతో బాధగా ఉంటోంది. కొన్నవి వెలిగించడానికి ఆవిడ మనసు ఒప్పుకోదు. అలాగే తంటాలు పడుతోంది

పడుకున్నాడే కానీ, రాహుల్‌కి నిద్ర అంత తొందరగా రాలేదు. అతని మనసంతా రేపు జరగబోయే సమావేశం మీదే ఉంది. ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని రాహుల్ గత రెండు సంవత్సరాలుగా ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. దాదాపు వందమంది ఉన్న ఒక విభాగంలో అతనికి "హోం ఆటోమేషన్" అన్న ఒక ప్రోజెక్ట్ మీద పని. వినడానికి కొత్తగా ఉన్నా, ఇంట్లో ఉన్న అన్ని రకాల గృహోపకరణాలనన్నింటినీ మొబైల్ ఫోన్‌తో అనుసంధానించి ఎక్కడనించైనా వాటిని ఉపయోగించగలిగేలా చెయ్యడమే ఆ విభాగం యొక్క ప్రధాన లక్ష్యం. దానిగురించి ఎంతో పరిశోధన చేస్తున్నారు. రకరకాల నమూనాలు తయారు చేసి, వాటిని పరిశీలించడమూ, పరీక్షించడమూ తప్పులున్నవాటిని సవరించుకోవడమూ, ఇలా నడుస్తోంది.

ఈ ప్రక్రియని ఒక పెద్ద ఫ్రేం వర్క్ లా తయారుచేసి ఎప్పుడు ఎక్కడ కావాలంటే అక్కడ చాలా సులువుగా అమలుపరిచేలా రూపొందించడం వారి ఆశ. దానికోసమే టీంలో అందరూ గత సంవత్సరం నించీ ఎంతో నిబద్ధతతోటీ, క్రమశిక్షణతోటీ పనిచేస్తున్నారు. తాము చేసే పనిని ప్రదర్శించే తొలి అవకాశం రావడంతో, వారందరికీ ఎంతో ఉత్సాహంగా ఉంది. అందుకే రాహుల్ ఆనందం.

చాలామంది మగపిల్లల్లాగే రాహుల్‌కి కూడా చిన్నప్పటినించీ ఎలక్ట్రిక్ పరికరాలన్నా, అవి ఎలా పనిచేస్తాయో తెలుసుకోవాలన్నా ఎంతో ఆసక్తి. చెల్లెలు దివ్య బొమ్మలతో ఆడుకుంటే రాహుల్ బేటరీలని వరసలో కలిపి వాటిల్లోంచి విద్యుత్తు పుట్టించి చిన్న చిన్న బల్బులు వెలిగించడం, కటకాలు, బల్బులూ ఉపయోగించి గోడమీద నెగెటివ్‌లని సినిమాల్లా చూపించడమూ ఇలాంటివన్నీ చాలా శ్రద్ధగా చేసేవాడు.

తాతగారి కోసం చేతికర్రకి చిన్న బల్బు అమర్చి సాయంత్రం పూట నడవడానికి వీలుగా రూపొందించి మొదటి బహుమతి గెలుచుకున్నాడు కూడా. అతని ఆసక్తి అతనితో పాటు పెరుగుతూ వచ్చింది. ఇంట్లో కంప్యూటర్ కొన్నప్పటినించీ కొత్తగా ఏదైనా చెయ్యాలన్న అతని ఇష్టం కంప్యూటర్ మీదకి మళ్ళింది.

ప్రతీ పనినీ ఒక బడ్జెట్ పెట్టుకుని ప్రతీ నెలా పుస్తకంలో లెక్కలు వేసుకుని, దాంట్లో కూడికలూ,

తీసివేతలు వేసుకునే అమ్మకి తొమ్మిదో తరగతిలో ఉండగా ఒక ఎక్సెల్ షీట్ తయారు చేసి ఇచ్చాడు. కావలిసిన లెక్కలన్నీ ముందే మేక్రోస్‌లో పెట్టి ఆవిడకి ఇచ్చిన ఆ షీట్ ఆవిడ పని ఎంతో తగ్గించిన సందర్భంలో ఆవిడ సంతోషం ఇంతా అంతా కాదు.

"చూశారా? మన రాహుల్ ఎంత బాగా చేశాడో? నేనేమీ వెతుక్కోక్కరలేదు. ఆటోమాటిక్‌గ్గా అన్నీ టక టకా అయిపోతున్నాయి.. భలే ఈజీ అండీ." అని మురిసిపోయింది.

ఇంగ్లీష్ టీచర్ ఐన అమ్మ నోట వచ్చే ఇంగ్లీష్ మాటలు ఎంతో ముచ్చట గా అనిపిస్తాయి, రాహుల్‌కి. వాటిని కరక్ట్‌గా ఎలా పలకాలో అదే రీతిగా పలికుతుంది ఆవిడ. ఆవిడ ఆటోమేటిక్ అన్న మాట వాడినప్పుడల్లా అతనికెంతో ఇష్టం.

అలాగే మొదటిసారి వెట్ గ్రైండర్ కొన్నప్పుడు బామ్మ పడిన సంబరం అంతా ఇంతా కాదు.

"ఒరే రాఘవా, మొన్నటివరకూ నేనూ, భారతి ఇడ్లీలకి, గారెలకి పప్పు రోట్లోనూ, చిన్న మిక్సీలోనూ రుబ్బలేక అవస్థలు పడేవాళ్ళం. ఇప్పుడు ప్రాణానికి సుఖంగా ఉందనుకో, ఒకసారి పప్పు కడిగేసి అందులో పారేస్తే అంతా ఆటోమేటిక్కే "అని నవ్వింది.

అలాగే మొదటగా రిమోట్ కంట్రోల్ టీ.వీ కొన్నప్పు డూ, ఇంజనీరింగ్ లో, తనకి సైకిల్ బదులుగా బైక్ కొన్నప్పుడూ ఇలా ఎన్నో రకాలుగా ఆటోమేటిక్/ఆటోమేషన్ తమకి ఆనందాన్ని పంచుతూ వచ్చింది.

"ఒరే అన్నయ్యా, నువ్వు నాకు చేసి ఇచ్చిన ఆటోమేటిక్ అలారం క్లాక్ చాలా బావుందిరా, నాకు వేరే టైం కావలసి వస్తే తప్ప వారం రోజులవరకూ మార్చుకోవక్కరలేదు " సంబరంగా అనేది దివ్య.. మామూలుగా మార్కెట్ లో కొన్న చిన్న గడియారానికి, చిన్న సాంకేతిక మార్పు చేసి అది డిజైన్ చేశారు అతనూ, ఫ్రెండ్ అజిత్, కలిసి.. అది మొదటిసారిగా చెల్లెలికి పుట్టినరోజు కానుకగా ఇచ్చాడు. ఇవన్నీ గుర్తుకు తెచ్చుకుంటూ, తాము రేపు ఆవిష్కరించబోయే ప్రాజెక్ట్ వివరాలు తలుచుకుంటూ ఎప్పటికో నిద్రపోయాడు.

తెల్లవారుతూనే అమ్మ పిలుపు వినబడింది.

"నాన్నా, రాహుల్.. తెల్లవారిపోయింది. నీ అలారం కొడుతూనే ఉంది, నువ్వు నిద్ర పోతూనే ఉన్నావు.. ఎక్కడికో వెళ్ళాలన్నావు కదా, కమాన్, గెట్ అప్ "అంది.

"లేవరా, రాహూ, " బామ్మ వెనకాలే అందుకుంది.

"అబ్బా, బామ్మా మళ్ళీ రాహూ, "అని విసుగ్గా లేచి కూర్చున్నాడు.

"నాకు తెలుసు ఆ మాటకి తప్పక లేస్తావని", ఈ సారి సినిమాల్లో నిర్మలమ్మ బామ్మ లా నవ్వింది ఆవిడ.

భారతి కూడా నవ్వుతూ వంటింట్లోకి దారి తీసింది.

" ఈ పనిపిల్ల మళ్ళీ రాలేదు.. పాపం మీ అమ్మ పొద్దున్నించీ గిన్నెలమీద కుస్తీ పడుతోంది "అంది బామ్మ.

రెండు బకెట్ల బట్టలు వేసుకుని మెషీన్ దగ్గరకి వెళుతోంది భారతి. రాహుల్ బ్రష్ నోట్లో పెట్టుకుని చూస్తున్నాడు. అప్పటికి ఒక సారి వేసినట్టుంది.. అది సెమీ ఆటోమేటిక్ మెషీన్. ఉతకడం అయ్యాకా బట్టలని తీసి పక్కనే ఉన్న టబ్‌లో వెయ్యాలి అవి డ్రై అవ్వడానికి.

"పోయినసారి కొందామనుకున్నాం ఆటోమేటిక్ మెషీన్, మీ బామ్మకి బాగోలేక కుదరలేదు.. ఈ సారైనా చూడాలి.. లేకపోతే ఇదే పెద్ద పని. " అంది.

"ఊ", అని తల పంకించి త్వరగా తయారయ్యాడు. తనకొచ్చే బోనస్‌తో అది కొనాలని ఎప్పుడో నిర్ణయించుకున్నాడు. మరొక గంటలో ఇంట్లోవాళ్ళందరూ ఎక్కడకి వెళ్ళాల్సినవాళ్ళు అక్కడకి వెళ్ళిపోయారు ఒక్క బామ్మగారు తప్ప.

ఆవిడ రోజూ లాగే పూజా, భోజనం కానిచ్చి తనగదిలోకి వచ్చి కాసేపు వత్తులు చేసుకుని, తర్వాత స్క్రేబిల్ బోర్డ్ ముందర పెట్టుకుని కూర్చుంది. ఒక అరగంట ఆడుకున్నాకా, భోజనంచేసి నడుం వాల్చి నిద్ర లేచాకా, తనకీ, కోడలికీ టీ కలిపింది, కోడలిది ఫ్లాస్క్ లో పోసి తన కప్పు తెచ్చుకుని కూర్చుంది టీ. వీ ముందర.

మరీ పెద్దది కాని రెండు బెడ్‌రూముల ఇల్లు అది. ముందర చిన్న వరండాలా ఉంచి కటకటాలు పెట్టారు, దానివెనక ఇప్పుడావిడ కూర్చున్న హాలూ, దానికి ఆనుకుని ఉన్న రెండు బెడ్‌రూములూ, ఒక వంటిల్లూ, హాలులోంచి పెరటిలోకి వెళ్ళడానికి కూడా ఒక చిన్న వసారా ఉంది.

గేట్ చప్పుడవడంతో ఆవిడ ముందర వసారాలోకి వెళ్ళి కటకటాల్లోంచి చూసింది. ఇంచుమించు గాలిలో తేలుతున్నట్టుగా వస్తున్నాడు రాహుల్ తన మోటారు సైకిల్ పార్క్ చేసి.

"ఇవ్వాళ నువ్వందరికన్నా ముందొచ్చావురా? భలే, అందుకే మబ్బేసిందేమో, రా, రా" అంటూ కటకటాలకున్న తాళం తీసింది.

మామూలుగా అయితే మామ్మతో వాదనకి దిగే రాహుల్ ఆ రోజేమీ పట్టించుకోలేదు.. కులాసాగా నవ్వుతూ "బామ్మా" అని ఆవిడ భుజమ్మీద ఒక్క చిన్న చరుపు చరిచి, విజిల్ వేసుకుంటూ లోపలకి వెళ్ళాడు.

ఆవిడా వెనకాలే వెళ్తూ, "టీ ఇవ్వనేమిట్రా? మీ అమ్మకి ఆలస్యం అవుతందదంది, నేను మర్చిపోయి ఎప్పటిలా చేసేశాను. ఉండు, తెస్తాను "అంటూ కప్పులో పోసుకొచ్చింది.

"ఊ ఇప్పుడు చెప్పరా, ఏమిటి సంగతి? ఈ పెందరాళే రావడం ఏమిటి? ఆ ఈలలూ, నవ్వుల వెనకున్న కథ ఏమిటి? నువ్వు వెళ్ళిన పని ఏమయింది? ఇవన్నీ తెలిసీ మీ బామ్మకి చెప్పకపోతే, " అంటూ నవ్వింది చిలిపిగా.

"ఉండుండు బామ్మా, అన్ని ప్రశ్నలూ ఒకేసారా? నేను వెళ్ళిన పని తొందరగా అయిపోయింది కనక తొందరగా వచ్చాను, అది మేము అనుకున్న దానికంటే బాగా ఐంది కనకే ఈ నవ్వులూ, ఈలలూ.. ఆ మాత్రం గ్రహించగలవు కదా "అన్నాడు నవ్వుతూ.

"ఓ, వెరీ కూల్ ! "అందావిడ నవ్వుతూ..

ఆవిడన్న తీరుకి రాహుల్ కి కూడా నవ్వు వచ్చింది.

" సరే.. ఇంతకీ మీరు ఇన్నాళ్ళూ చేసిన పనేమిటి? వాళ్ళకంతగా ఎందుకు నచ్చింది? ఈ వివరాలు కూడా చెప్పుము "అంది ఖాళీ అయిన తన కప్పుని పక్కన పెడుతూ.

"ఇప్పుడే చెప్పాలా? "అని రాహుల్ అడగ్గానే

"అవును తప్పదు "అందావిడ.

ఇంట్లో మనవలు కంప్యూటర్ లో ఆటలు ఆడుకోవడం, లేదా ఏవైనా చిన్న చిన్న పనులు చేసుకోవడమూ మాత్రమే చూసిన ఆవిడకి కంప్యూటర్ రంగంలో ఉద్యోగాలంటే ఏం చేస్తారో, తెలుసుకోవాలని మహా సరదా. ఎప్పుడడిగినా రాహుల్ ఏదో ఆవిడకర్థం అవ్వాలన్న రీతిలో సింపుల్ గా సమాధానం చెప్పేయడం ఆవిడకి నచ్చేది కాదు. చాలా రోజుల తర్వాత ఇంటికి తొందరగా వచ్చినప్పుడడిగితే చెప్తాడనే అలా అంది.

" సరే.. విను బామ్మా, మళ్ళీ అర్థం అవలేదన్నావంటే ఇంకోసారి అస్సలు చెప్పను, "బెదిరిస్తున్నట్టుగా అన్నాడు.

"ఓ ఐ యాం అ స్మార్ట్ వుమన్. నాకనీ తెలుస్తాయి. ఎ స్మార్ట్ వుమన్ అనకూడదుట, అ స్మార్ట్ వుమన్ అనాలిట. మీ అమ్మ చెప్పింది. ఇంగ్లీష్ టీచర్ కదా మరి " అంది. చిన్నగా నవ్వాడు రాహుల్.

" మా కంపెనీలో చాలా మంది పని చేస్తారు అన్న విషయం నీకు తెలుసు కదా, అందులోంచి కొంత మందిని మాత్రం ఎన్నుకుని ఒక స్పెషల్ ప్రోజెక్ట్‌లో పెట్టారన్నమాట." అంటూ మొదలు పెట్టాడు

" అబ్బా, అవన్నీ నాకు తెలుసురా. అలా ఎంపికైనవాళ్ళల్లో మా బంగారుకొండ కూడా ఉన్నాడు. అక్కడేం చేశావో చెప్పు " అంది.

"ఉండు మరి. మేము చేసే పనినే హోం ఆటోమేషన్ ప్రోజెక్ట్ అంటారు. " అని అతను అనగానే వెంటనే

" ఆటోమేషన్ అంటే గుర్తొచ్చిందిరోయ్. పొద్దున్న నేను ఆ మాట పెట్టాను స్క్రేబిల్‌లో. ఎప్పుడూ మీ అమ్మ ' ఆటోమేటిక్ ' అంటూ ఉంటుంది కదా, అందులోంచి ఇది పెట్టచ్చా అని ఆలోచించా. మొన్నెప్పుడో నువ్వు మీ

నాన్నతో అంటున్నప్పుడు విన్నట్టనిపించింది. కరక్టేనా ఆ పదం? ఐతే నువ్వు చేసే పనే, నేను పెట్టిన పదం అన్నమాట అసలు ' ఆటోమేషన్ ' అంటే ఏమిట్రా? ఆటోమేటిక్‌కి, దీనికి తేడా ఏమిటి? "అందావిడ ఉత్సాహంగా.

"ఏ పనైనా మనిషి ప్రయత్నం తక్కువగానో, లేక అసలు అక్కరలేకుండానో జరిపించగలిగితే దాన్ని - ఆటోమేటిక్‌అంటారు కదా , దాన్నే పెద్ద స్థాయిలో జరపగలిగితే ఆటోమేషన్ అనొచ్చు. అంటే మన ఇంట్లో ఏదైనా ఒక పని మిషన్ పెట్టి చేస్తున్నామనుకో అది ఆటోమేటిక్, అదే పనిని చాలామంది కోసం రెగ్యులర్ గా, సులువుగా, సునాయాసంగా, క్రమం తప్పకుండా చెయ్యగలగడం ఆటోమేషన్ అన్నమాట. ఇదేమీ కొత్తది కాదు బామ్మా, చాలా రోజులనించీ, అనేక రంగాలలో ఉంది. దివ్య చిన్నప్పుడు అమ్మ మామూలు మిషన్ తో గౌనులు కుట్టేది కదా, తర్వాత దానికి మోటారు పెట్టించుకుంది కదా అప్పుడది ఆటోమేటిక్ అయ్యింది, అంటే మిషన్ పని ఎక్కువ, అమ్మ పని తక్కువ.. అలాంటివే ఒక వంద మిషన్లు పెట్టి చిన్నపిల్లల గౌనులు కుట్టడం మొదలుపెట్టి అమ్మారనుకో, అది ఆటోమేషన్ అనవచ్చు, అయితే దాంట్లో చాలా విషయాలుంటాయనుకో, సింపుల్ గా చెప్పాలంటే ఇలా చెప్పచ్చు." అన్నాడు.

"అది సరే, నీ కంప్యూటర్ చదువుకీ దానికీ ఏమిటి సంబంధం?" అందావిడ.

"అది నీకర్థమవాలని చెప్పాను. మేము కంప్యూటర్ ఉపయోగించి, కొత్త సాఫ్ట్‌వేర్ రాసి ఇవన్నీ అమలయ్యేట్లా చేస్తామన్నమాట.

మా హోం ఆటోమేషన్ లో మేము ఇంట్లో ఉండే లైట్లూ, ఫాన్లూ, స్విచ్చులూ అన్నీ రిమోట్‌తో కానీ, ఇప్పుడు కొత్తగా ఫోన్‌తో కానీ కంట్రోల్ చేసేలా రూపొందించామన్నమాట. మన చేతిలో మొబైల్ ఫోన్ ఉంటే మంత్రదండం ఉన్నట్టే, ఎక్కడనించయినా ఇవన్నీ కంట్రోల్ చెయ్యవచ్చు" అన్నాడు.

"దాన్ని చాలా బాగా ఇవ్వాళ ప్రెజంట్ చేశాము.. మీటింగ్ చాలా బాగా జరిగింది. ఈ రోజు మేము వెళ్ళినది పెద్ద గృహోపకరణాల కంపెనీకి, వాళ్ళు లైట్లూ, ఫానులూ మాత్రమే కాదు, టీ.వీలు, ఫ్రిజ్‌లూ, ఏ.సీలూ అన్నీ చేస్తారు. వచ్చేవారం బొంబాయిలో ఒక పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీకి వెళతాం, ఇవి రెండు క్లిక్ అయితే మాకింక ఎంతో బావుంటుంది" అన్నాడు ఆనందంగా.

బామ్మగారేమీ మాట్లాడలేదు

"అర్థమయిందా బామ్మా, ఇందాకటినించి అన్ని భేతాళ ప్రశ్నలు వేశావు కదా, ఇప్పుడిలా మౌనంగా ఉన్నావేం? నీకు కూడా చాలా నచ్చింది కదూ "అన్నాడు నవ్వుతూ..

"బానేఉందనుకో, కానీ ఇంతోటి లైట్లూ ఫానులు మనం వెలిగించుకుని ఆర్పుకోలేమూ, దీనికో రిమోటూ, కాదంటే ఫోనూ ఎందుకురా? "అందావిడ..

"అలా అనుకుంటేనే తప్పు.. కొత్త ఐడియాలు ఎలా వస్తాయి? మన ఇల్లంటే చిన్నది కనక మనం చేసేసుకుంటాం. బాగా పెద్ద ఇళ్ళు, హోటళ్ళూ, కాన్ఫరెన్స్ రూములూ అలాంటివి ఉన్నాయనుకో,, అప్పుడు? "అన్నాడు కళ్ళేగరేస్తూ

"ఇప్పుడేం చేస్తున్నారుట? "అందావిడ తనూ కళ్ళెగరేస్తూ.. ఫక్కున నవ్వాడు బామ్మని ఆ భంగిమ లో చూసి

"అదే చెప్పానా, ఇప్పుడున్నది చాలు, అనుకుంటే ఎదుగుదలకి ఛాన్స్ ఏది బామ్మా? నువ్వు రోజూ రాత్రి పదిగంటలకి పడుకుంటావనుకో, ఒక్కసారి ఫోన్‌లో అది చెప్పేస్తే, వచ్చే నెలవరకూ అది పదిగంటలకే లైటు ఆ-ర్పేస్తుందన్నమాట.. పెద్ద పెద్ద ఆఫీసుల్లో ఏ.సీలు అవీ కూడా దీనితో ఎంతో బాగా నియంత్రించుకోవచ్చు. అలాగే ఏ వస్తువులు ఎప్పుడు మార్చాలో కూడా చెపుతుంది. " ఇలా ఉత్సాహంగా దాదాపు పది నిమిషాలసేపు తమ పని గురించి చెప్పాడు. చివరగా అన్నాడు..

" ఇప్పుడు కొత్తగా వస్తున్న అపార్ట్‌మెంటుల్లో ఇవి ఎంతగా అడుగుతున్నారో తెలుసా? పూర్తిగా ఆటోమేటిక్ ఇళ్ళంటే చాలా గిరాకీ.. మనం కూడా పెట్టేసుకోవచ్చు అది తొందరలో "అన్నాడు.

ఆవిడా నవ్వింది.

"బావుందిరోయ్.. మనింట్లో పెట్టుకుంటే మనం ఈ మాత్రం కూడా లేవక్కరలేదు, ఇంట్లోకూడా నడవక్కరలేదు.. కదూ.. మరి మనుషులు ఇంకా బద్ధకస్తులయిపోరూ? "అంది

"అయినా ఈ సెల్ ఫోన్‌తో ఎన్ని పనులు చేయిస్తార్రా మీరందరూనూ? అది ఫోనో, రేడియోనో, కెమెరానో, వాచీయో, అలారమో, వీడియో చూపించేదో మరేదో కూడా తెలియడం లేదు ఇప్పటికే. ఇంకా ఇవన్నీ కూడా కలిపితే ఇంకా ఎలా ఉంటుందో? ఒకవేళ ఆ ఫోన్ పోయిందనుకో? అప్పుడు. ఇంతకంటే అవసరమైన ప్రాజెక్ట్ లేమీ కనబడలేదా మీ బాస్‌కి ? "అంది ఆవిడ కొంచం అసంతృప్తిగా.

"శుభం మాట్లడమంటే ఎందుకు బామ్మా అలా అంటావు? మార్కెట్ డిమాండ్ ని బట్టే కదా మనం పని చెయ్యాలి, ఎక్కడ డబ్బుంటే, అక్కడే బిజినెస్ కదా "అన్నాడు.

"అవుననుకో, నువ్వన్నదీ నిజమే. ఏమిటో ఎన్నో అవసరమైన పనులున్నాయిగా అనిపించి అలా అన్నాను. అంతేకాదు. మీ ఆటోమేషన్ కేవలం లైట్లకి, ఫాన్లకి పరిమితమైతే పరవాలేదు. ఇప్పటికే మనల్ని అన్నిరకాలుగానూ మిషన్లు తరుముతున్నాయి, రేప్పొద్దున్న ఇంకేం చేస్తాయో అని ఆలోచిస్తేనే కొంచం భయంవేస్తోందిరోయ్. ముసలిదాన్ని కదూ. రేపు నీదో, మీ నాన్నదో ఫోన్, బామ్మా, నువ్వొచ్చిన పని అయిపోయింది, ఇంకా ఎందుకు ఇక్కడ నువ్వు ? అని నా స్విచ్ కూడా నొక్కేస్తుందేమో" నవ్వుతూ అని.

కోపంతో రంగులు మారుతున్న రాహుల్ ముఖం చూసి.

"ఊరికే అన్నాలేరా? మీ ఇద్దరి పెళ్ళిళ్ళూ చూడకుండా నేనెక్కడికి వెళతాను? నరకలోకపు ఆటోమేషన్ నించి యముడి మొబైల్ ఫోన్ పిలిచినా సరే, మా రాహులయ్యకి కొడుకు పుట్టకుండా నేను రావడం కుదరదు, ఈ సారికి అలా ప్రొగ్రామింగ్ చేసుకోమని చెప్పేస్తాను సరేనా ? " అంటూ నవ్వుతూ.

"అన్నట్టు నా వత్తుల పనిని ఆటోమేషన్ చెయ్యచ్చేమిట్రా? మొక్కడమైతే మొక్కాను కానీ ఈ మధ్యన కొంచం ఓపిక తగ్గింది కదూ. ఏడాదికి రెండువేల పైన వత్తులు చెయ్యడం కష్టంగా ఉంది.. అందుకే అడిగాను.." అని నవ్వుతూ మనవడిని ఏడిపించింది.

రాహుల్ కూడ ఆ మాటకి నవ్వేశాడు.

మర్నాడు అందరికీ మామూలుగానే తెల్లారింది ఒక్క బామ్మగారికి తప్ప. రోజూ అందరికంటే ముందే నిద్రలేచే అమ్మ ఇంకా లేవలేదని చూసిన రాఘవరావుకి అర్థం అయింది, వెంటనే పిలిచిన డాక్టర్ తెల్లవారుఝామున గుండెపోటు వచ్చి నిద్రలోనే పోయారని చెప్పాడు.

కుటుంబమంతా షాక్‌తో, సజలనయనాలతో నిలబడిపోయారు. మంచం ముందున్న చిన్న స్టూల్ మీద సగం పరిచి ఉన్న స్క్రేబిల్ బోర్డూ, పక్కన ఇత్తడి భరిణెలో కట్టలుగా కట్టి పేర్లు రాసిపెట్టిన చిన్న చిన్న ప్లాస్టిక్ కవర్లలో ఉన్న వత్తులూ, మధ్యలో మంచమ్మీద నిద్రపోతున్నట్టుగా ఉన్న బామ్మగారూ.

"ఆటోమేషన్" పదం బోర్డ్ మీద,

" ఒరే నా వత్తులని ఆటోమేషన్ చెయ్యవచ్చా " మనసుని మెలి తిప్పుతున్న ఆవిడ ప్రశ్నా,

"అదృష్టవంతురాలు, సునాయాస ( ఆటోమేటిక్??) మరణం అందరికీ వస్తుందా? " అన్న పక్కవారి మాటలూ, ఇవన్నీ చూసున్న రాహుల్ దుఃఖం ఆపుకోలేక, తండ్రిని పట్టుకుని భోరుమన్నాడు.

" ఆట (ఆటో ??) కద జననాలు, ఆట (ఆటో??) కద మరణాలు " భరణి గారి కవిత్వం యేసుదాస్ గారి గొంతులో మదిని కదిలించేలా పలుకుతోంది ఎక్కడో..

●●●

Click here to share your comments on this story